# 13.

# దైవకృప మూర్ఖుని జ్ఞానిగా మార్చగలదు

భగవద్గీతా కించిదధీతా
గంగాజల లవ కణికా పీతా
సకృదపి యేన మురారిసమర్చా
క్రియతే తస్య యమేన న చర్చా

కించిద్భగవద్గీతా పఠనము
కొంచెము గంగాతీర్థము పానము
హరి పూజన మొకపరి గావించిన
అతనిని యముడేమని తర్కించును. ॥భజ గోవిందం॥

దివ్యాత్మస్వరూపులారా!

శంకరుల భక్తులైన ఆనంద అనే ఒక శిష్యునితో శ్లోకము ప్రారంభమైంది. అయితే ఈ ఆనందుడు మందబుద్ధి అగుటచేత తనతో కూడిన విద్యార్థులందరు కూడను ఈ మందబుద్ధికి తగిన అర్థము 'గిరి'. గిరి అని పిలుస్తూ వచ్చారు. గిరి అనగా మందబుద్ధి. అట్టి మందబుద్ధితో చేరిన ఆనందుడు కనుక యితనికి ఆనందగిరి అని పేరు పెట్టినారు. అయితే యిట్టి మందబుద్ధుడైన గిరి గురుభక్తి లోపల మునిగి గురువు యొక్క సేవలు మాత్రమే సల్పుతూ గురువాజ్ఞలు శిరసావహించి కాలమంతయు గురువునకు అర్పితము చేసే చిత్తముతో తనయొక్క జీవితము గడుపుతూ వచ్చాడు. గురువుచెంత చేరిన మిగిలిన విద్యార్థులు గురువు చెప్పిన పాఠములు సాయంకాలమునకే అప్పజెప్పి గురువు యొక్క ఆశీర్వాదములు అందుకొనేవారు కాని గిరి అట్లు కాక గురువు చెప్పిన పాఠములు ఎన్నినెలలైనా అప్ప చెప్పటానికి సంసిద్ధుడు కాక గురువు యొక్క సేవల యందు మాత్రమే తనయొక్క కాలమును అంకితము గావిస్తూ వచ్చాడు. అయితే గురువునందే చిత్తము లగ్నము చేయటంచేత గురువు అనుగ్రహము కొంత కాలమునకు అతనిపైన ప్రసరించి ఆ గురువు అనుగ్రహముచేత తనకు ఎక్కడ లేని శక్తి సామర్థ్యములు ప్రవేశించి తోటక వృత్తములనేటువంటి వాటిని గురు స్తోత్రములుగా తాను లిఖించటము చేత అతను

srisathyasaivachanamrutam

తోటకుడు అనే పేరు కూడను అందుకున్నాడు. ఈ తోటకుని యొక్క లక్ష్యము సర్వవిద్యల యొక్క సారము. ఆత్మాన్వేషణ అనే సత్యములో తన జీవితమును విశ్వసించుకుంటూ వచ్చాడు. మిగిలిన శిష్యులందరు పుస్తకములో నున్న విషయములు మస్తకములో చేర్చుకొని మస్తకమును కూడ ఒక పుస్తకముగా మార్చుకున్నారు కాని తోటకుడు అట్లుకాక గురువు అనుగ్రహమనే సారమును హృదయ కమలము నుండి ఏ తుమ్మెద పోయి ఆరగించునో ఆవిధముగా గురువు యొక్క హృదయమునుండి ఆ అనుగ్రహమనే మకరందమును గ్రోలిన వాడుగా తయారయ్యాడు. దీనినే

**చదువులన్నియు చదివి చాల వివేకియై**
**మగిడి తన్నెరుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏరీతి ఉన్నను**
**హీనుడవ గుణము మానలేడు**
**తరచి చదువు చదువ తర్కవాదమెగాని**
**పూర్ణజ్ఞానం బెపుడు పొందలేడు**
**చదువులన్నియు చదివి చావంగ నేటికి**
**చావులేని చదువు చదువవలయు**

అని అర్థము చేసుకున్నాడు. అందువలననే తాను పవిత్రమైన భారతీయ సంస్కృతి యొక్క రసమును గ్రోలిన భగవద్గీతను ఒక్కపరి మనం పఠించినా చాలన్నాడు. ఆకలైన అయిన వ్యక్తికి ప్రపంచములో పండిన పంటలన్నీ తాను ఆరగించనక్కర లేదు. తన జానెడు పొట్టకు పట్టెడు అన్నము చిక్కితే చాలు అనేటువంటి లక్ష్యమునందు భగవద్గీతనంతయు మనము ఉచ్చరించనక్కర లేదు. ఒక్క శ్లోకమును మనము ఆచరణలో పెడితే చాలని ఆతోటకుడు విశ్వసించాడు. ఇంతియే కాదు రోగము వచ్చిన వ్యక్తికి ప్రపంచములో కోట్లకొలది పేర్లతో అభివృద్ధి అయిన మందులు ఆరగించనక్కర లేదు. తన రోగమునకు తగిన ఒక్క ఔషధమును ఆరగించితే చాలు. రోగము నివారణ అవుతుంది. అదే లక్ష్యము నందుంచుకొని 'గీతా గంగోదకం పీత్వా పునర్జన్మ నవిద్యతే' అన్నాడు. నీవు దాహముగా నుండిన సమయములో ఒక టంబ్లరు నీరు త్రాగితే చాలు గంగా నదినంతా పొట్టలో పోసుకోనక్కర లేదు. అదేవిధముగా ఈ తోటకుడు భగవదనుగ్రహమనే కిరణము ఒక్కటి నా

sri sathyasai vachanamrutam

హృదయముపై ప్రసరిస్తే చాలు, సర్వ శక్తిమయుడైన ఈ జగత్తునంతా కూడను ఒక ఆత్మస్వరూపునిగా నిరూపణ చేయవచ్చును అనే దృఢ విశ్వాసము ఆనందగిరియందు ఉండినది. అట్టి దృఢవిశ్వాసము కల్గిన శిష్యుడగుట చేతనే తోటకుని, బద్రి అనే స్థానమునకు పీఠాధిపతిగా నియమించాడు శంకరుడు. శంకరుల వారికి నలుగురు ప్రత్యేకమైన ప్రథమ శిష్యులుగా యేర్పడినారు. పద్మపాదుడు, సురేశుడు, తోటకుడు, హస్తామలకుడు అని నలుగురు ప్రథమ శిష్యులుగా నిలిచారు. ఈ నలుగురిని మన భారతదేశము నలుమూలల ఆధ్యాత్మిక అద్వైత సిద్ధాంతము స్థాపించే నిమిత్తమై నాలుగు పీఠములుగా నియమించి, నాలుగు పీఠములకు ఈ నలుగురు శిష్యులను అధికార స్థానములో ఉంచాడు. ఆ మండనమిశ్రుని సురేశుడని కూడను పిలుస్తూ వచ్చారు. ఈ మండనమిశ్రులతో శంకరులవారు అన్ని రకముల విద్యలతో తర్కము గావించి ఆ శాస్త్రమునందు విజయమును సాధించి, ఆ మండనమిశ్రుతో వేసుకున్న పోటీని జయించి గృహస్థుడైన మండనమిశ్రునికి సన్యాసాశ్రమము నందించాడు. అతని భార్యయే ఉభయభారతి. మండనమిశ్రుడు సమస్త శాస్త్రములు, సమస్త వేదములు కూడను చక్కగా గ్రహించినవాడు. నిజముగా అతడు ఒక జ్ఞానస్వరూపుడనే చెప్పవచ్చును. ఒక విద్యానిలయుడని కూడ అనవచ్చును. ఇట్టి పవిత్రమైన శిక్షణ అందుకొన్న శిష్యునియందు శంకరులవారు అందించిన గురుబోధ ఎట్టిదని మనము చక్కగా విచారించవలసిన విషయము. అట్టి గురుత్వముగాని, ఏకచిత్తుడైన శిష్యత్వముగాని నేడు లభ్యము కాకపోవటము చేతనే యిట్టి పరిస్థితి భారత దేశమునకు ప్రాప్తమైనది.

**శ్రవణము - ఆచరణ**

బోధలు రెండు రకములు. నోటితో చెప్పి మనస్సును మార్చి ప్రవర్తనయందు యిమిడ్చేది ఒకటి. అయితే బోధించటం చేత శ్రవణము చేసి మనసును కొంతవరకు మార్చుకోటానికి ప్రయత్నము సల్పవచ్చును. అది కొంత ఆచరణలోకి రావటం కష్టం. ఇంక రెండవమార్గము తాను చేసి యితరులకు చూపించి చేయించే దానికి ప్రయత్నము చేయటము రెండవ మార్గము. మనము చేయటంచే అనుసరించే వానికి సర్వాంగములను అందులో లయమొనర్చే సద్బుద్ధి కలుగుతుంది. చెప్పటంచేత కేవలం శ్రోత్రములు మాత్రమే ఆనందపడి హృదయము వరుకు చేర్చి తదుపరి అంతర్ధానమవుతుంది. అయితే

శంకరులవారు తన శిష్యులు మహాబుద్ధి కుశలతతో యేర్పరచిన శ్లోకములను తాను సులభంగా అంగీకరించక ప్రతి శ్లోకమునకు అంతరార్థము ఏమిటో, తన ఉద్దేశ్యము ఏమిటో తెలుసుకోటానికి పరిక్షిస్తూ వచ్చాడు. శిష్యులను ఆనందగిరిని దగ్గరకు పిల్చి 'కించిత్ భగవద్గీతా పఠనము' అన్నావు. భగవద్గీత కొంచెము చదువుతే చాలని చెప్పావే. 700 శ్లోకములుగా నున్న భగవద్గీతను కొంచెం చదివితే చాలని చెప్పావు దీని ఉద్దేశ్యము ఏమిటి? కొంచెం చదివితే నీ మనస్సు సంస్కరింపబడుతుందా? నీ హృదయము కొంత వరకు పరిశుద్ధమవుతుందా? లేక భగవద్గీత యొక్క సర్వశాస్త్రముల సారము, సర్వగమ్యముల మూలము, సర్వధర్మముల స్థానము కూడను గ్రహించటానికి వీలవుతుందా! నీ ఉద్దేశ్యము ఏమిటో తెలుపుమని కోరాడు. అందుకు ఆనందగిరి ముచ్చటైన పలుకులు ముచ్చటించాడు. 'స్వామీ! భగవద్గీత 700 శ్లోకములతో చేరినది కనుక మొదటి అధ్యాయము నుండి 18వ అధ్యాయము వరకు చదవండి అని చెప్పినప్పుడు మందబుద్ధులైన నాబోటివారు యింత పెద్ద గ్రంథము నేను చదవగలనాయని ప్రప్రథమములోనే భగవద్గీతకు దూరము కావచ్చు. కనుక మొట్టమొదట భగవద్గీత చదవటానికి కొంచెమైనా ప్రారంభము చేస్తే అభిరుచి కొంతవరకు హృదయమునకు చేరి ప్రతిదినము దానిని పఠించాలనే అభీష్టము వారిలో కొంత అభివృద్ధి కావచ్చును. ఏవిధముగా అనగా పిల్లవానికి అన్నప్రాసన చేసే సమయములోపల ఒకేతూరి అన్నము, సాంబారు, మజ్జిగ అన్నీ తినలేడు. కనుక, మొట్టమొదట తియ్యని పదార్థమును మెత్తగజేసి నోటికి అందించినప్పుడు క్రమక్రమేణా ఆ రుచిని మరిగి తదుపరి తట్టలోనున్న పదార్థాన్ని పొట్టలో వేసుకోటానికి ప్రయత్నము చేసినట్లుగా ఈ మందబుద్ధి గలవారికి భగవద్గీతా పరిచయము కొంతైనా చేసితే భగవద్గీత యొక్క తత్వాన్ని వారు అభివృద్ధి పరచుకోవచ్చుననే ఉద్దేశ్యముతో కించిత్ భగవద్గీతా పఠనము అని వ్రాసాను' అని చెప్పాడు. ఇంక గంగాజలము యొక్క సారమును మనము గ్రోలినప్పుడు అది కొంచెము మాత్రమే గ్రోలాలి అని చెప్పావే దీనిలోని అంతరార్థము ఏమిటి అని తిరిగి శంకరులవారు ప్రశ్నించాడు. గంగ మహా పవిత్రమైనది. భారతదేశ మాతృవర్తి, ప్రపంచవ్యాప్తి పవిత్రకీర్తిని ఆర్జించిన గంగామాత. ఆ గంగాజలము ఎన్ని సంవత్సరములు పెట్టినప్పటికిని చెడిపోని పదార్థము. ఆ జలమునందు కొన్ని శక్తులు చేరటం చేత ఈ జలము ఆరోగ్యమును మాత్రమే

srisathyasaivachanamrutam

అందించటము కాకుండా ఎన్ని దినములు పెట్టినప్పటికి చెడిపోని పదార్థముగా ఉండి ఈశ్వరుని శిరస్సునుండి, విష్ణువు యొక్క పాదముల నుండి ఉద్భవించిన పవిత్ర భావముతో ఒక చుక్కనీరు త్రాగినప్పటికి చాలు అనే ఉద్దేశ్యముతో ఈ పదమును ఉచ్చరించాడు. త్రికాల, త్రిలోక, త్రిగుణములందు కూడను సజీవ స్వరూపముతో ప్రవహించే పవిత్రమైనది ఈ గంగ. అనగా స్వర్గమునందు మందాకిని అని పేరుతో భూలోకమునందు భగీరథి అనే పేరుతో పాతాళలోకము నందు భగవతి అనే పేరుతో ఒకే గంగ ప్రవహిస్తూ ఉంటున్నాది. భూత, భవిష్యత్, వర్తమానము లందు గాని ఇంక కొన్ని రకములైన ఉత్తమ, మధ్యమ, అధమ లోకములందుగాని సత్త్వ, రజో, తమో గుణములందు గాని, ఏకత్వముగా ప్రవహించే భారతీయ సంస్కృతియే మహాగంగా ప్రవాహము అని ఈ ఆనందగిరి గురువుతో చెప్పాడు. ఈ ఆనందగిరి యొక్క అంతరార్థము యింతటితో తృప్తిగాక శంకరులవారు మరింత లోతునకు విచారిస్తూ వెళ్లారు. స్వర్గ, మధ్య, పాతాళలోకములు వున్నవా అయితే ఏరూపములో వున్నవి? ఏవిధముగా అనుభవానికి వస్తాయి అని మరి ప్రశ్నించాడు. అప్పుడు ఆనందగిరి 'పిపీలకాది బ్రహ్మపర్యంతము కూడను ఏకత్వమైన ఆత్మదివ్యత్వముగా ప్రకాశిస్తున్నదనే సత్యాన్ని ప్రకటించిన వ్యక్తి స్వర్గలోకవాసిగా నేను భావిస్తున్నాను. అనగా నిరంతరము శాంతి సుఖములతో ఆనంద స్వరూపుడై సత్యభావమును ప్రేమ కిరణముల ద్వారా ఆరగించే వ్యక్తిగా గుర్తించినటువంటి ఉత్తమస్థానమే స్వర్గము అన్నాడు. పశుపక్షి క్రిమికీటకాదుల యొక్క భేదభావములను పురస్కరించుకొని మానవుడు ప్రత్యేకించిన ఒక వ్యక్తిగా భావించినంత వరకు వాడు మిధ్యలోకమైన మధ్యస్థానమునకు చేరిన వాడన్నారు. ఇంక పాతాళలోకమనే దానికి చక్కని ఆధారాన్ని అందించాడు. మానవత్వమునే మరచి లేక ప్రకృతి తత్త్వాన్నే మరచి వేదశాస్త్ర, యితిహాస పురాణములను ఏమాత్రము లెక్కించక వారందరు కూడను పాతాళ లోకవాసులేనని తాను ప్రబోధించాడు కాన ప్రతియొక్క విషయమందు మనస్సు యొక్క భావములో యీ స్థానములంతా కూడను హెచ్చు పల్లములు మనకు కనిపిస్తూనే వుంటాయి. మానవుని దేహము ఏరకముగా హెచ్చు పల్లములుగా వుంటున్నాదో దానిలో నివసించే మనస్తత్త్వము కూడను అదే హెచ్చుపల్లములు గానే ఉంటుంది. మనసు మనిషి హెచ్చు పల్లములు లేనిది మనకు జగత్తులో కనిపించదు. ఒకే

srisathyasaivachanamrutam

మానవుని యందు సత్వ, రజో, తమో గుణములు నివసిస్తూ ఆయా సమయములను పురస్కరించుకొని ఆయా గుణములు విజృంభించుచుండటము మానవునికి నిత్యానుభవములో సత్యమైన స్వరూపము. అనగా ఆనందముగా, సుఖముగా వుండినటువంటి సమయములోపల సాత్వికమైన శాంతభావములు కొంతవరకు పైకిరావటం, తిరిగి తన అభీష్టమునకు విరుద్ధమైన క్రియలు జరిగినప్పుడు తాను ఉద్రేకవంతుడై తనయొక్క మానవత్వాన్ని మరచి కొంతవరకును ఆవేశమునకు గురికావటము లేక పొట్టనిండుకు మెక్కినప్పుడు తమో గుణస్థితుడైపోయి అనగా చల్లగా తాను నిద్రావస్థయందు చేరటం. ఇలా ఒక్క మనయందే యీ మూడు గుణములు ఎట్లు నివసిస్తున్నవో, ఈ మూడు గుణములకు మూడు దేహములు ఎట్లు లేకుండా ఉన్నవో అదే విధముగా మానవుని యందు స్వర్గ, మర్త్య, పాతాళలోకములనేవి మానసిక తత్త్వములను పురస్కరించుకొనే బయలుదేరుతుంటాయి. దీనినే ఆస్తిక, యాస్తిక, ఆస్తికనాస్తిక, నాస్తిక అనే నాలుగు స్థానములకు దీనిని విభజించినారు. నీవు నాస్తికుడైనా మంచిదే గాని ఆస్తికనాస్తికుడు కాకూడదన్నారు. కనుక నీవు రెండు గుఱ్ఱముల స్వారీ చేయుటకు యేమాత్రము పూనుకోకు. గుఱ్ఱము స్వారీ తెలియనప్పుడు గుఱ్ఱము ఎక్కకపోయినా ఫరవాలేదు లేక ఒక గుఱ్ఱము నెక్కినా మంచిదే గాని రెండు గుఱ్ఱముల స్వారీ చాలా ప్రమాదమని ప్రబోధించాడు ఈ శ్లోకార్థములో. ఇదంతయు మానవునిలో దివ్యత్వమైన ఆత్మప్రవాహమే ఈ గంగా ప్రవాహము అని. కనుక భారతదేశమునందు పవిత్రమైన గంగకు, మానవుని హృదయమందు నిష్కల్మషమైన సత్యభావములకు సన్నిహిత సంబంధము యేర్పడినటువంటిది. కనుక భారతీయధర్మము గంగా ప్రవాహమువంటిది. అట్టి మాలిన్యపడక, అపవిత్రముకాక, చెడిపోక, నిత్యసత్యమైన ఆకారమును ధరించేటటువంటి స్వరూపమే భారతీయ ధర్మము యీ లోకమునకు గంగా స్వరూపము లోపల దిగివచ్చినది. శంకరుల వారు అందించిన ఈ పవిత్రమైన రత్నములు స్వార్థరహితమైనవి. ఏవిధముగా అనగా గంగా ప్రవాహము తనకు తాను ఆరగించే ప్రయత్నమునకు పూనుకోదు. మంచి ఫలవృక్షము ఆ ఫలమును తాను ఆరగించటానికి పూనుకోదు. అదేవిధముగా మహనీయులైన వారు వారి యొక్క సర్వశక్తులు కూడను

srisathyasai vachanamrutam

వారినిమిత్తమై వినియోగ పరచక లోకకళ్యాణము నిమిత్తమై త్యాగము చేసిన మహామూర్తులు. ఇంక మూడవది విష్ణుపూజ ఒకపరి గావించిన అతనిని (యముడేమని సాధించును) యముడు ఏమి బాధించును. అతనితో యముడు కూడా తర్కించటానికి యేమాత్రము అధికారము లేదన్నాడు. విష్ణుత్వమనగా అర్థము సర్వవ్యాపకత్వమే. విష్ణుత్వాన్ని ఒక్కతూరి చింతిస్తే అనగా సర్వవ్యాపకత్వాన్ని ఒక్కతూరి చింతిస్తే చాలు అన్నారు. విష్ణువు అనగా కేవలము శంఖు, చక్ర, గదా, పద్మములకు చేరినవాడు కాదు. విష్ణుత్వమనగా సర్వవ్యాపకత్వము. అతనికి రూపము లేదు గాని స్వభావము మధురముగా వుంటున్నాది. మధురత్వమైన ఆనందతత్వమే విష్ణుత్వమని ఒక అర్థము. దీనికి ఆనందగిరి చక్కని ఒక ఉదాహరణము నందించాడు. స్వామీ! బియ్యమును పిండిచేసి మనము జిహ్వాకు అందించినప్పుడు ఎట్టి రుచి అనుభవించటానికి అవకాశము లేదు. లేక గోధుమలను పిండి చేసి రుచి చూడటానికి నాలుకపై పెట్టుకున్నప్పుడు యిందులో కూడా ఏమాత్రము రుచి చిక్కదు. యింక బేడలు పిండిచేసి జిహ్వాకు చేర్చినప్పుడు యేమాత్రము రుచి చిక్కదు. అయితే చక్కెరని బియ్యపుపిండిలో వేసి తీయనైన పదార్థముగా చేసుకుంటూ దానికి రూప నామములు కలిపిస్తున్నాము. ఇదే చక్కెరను మనము బేడలపిండిలో వేసి బూంది లడ్డులని అనేకరకములుగా తీసుకున్నప్పుడు అందులో దాని స్వభావమైన మధురత్వము మనకు అందిస్తుంది. గోధుమరవ్వలో ఈ చెక్కర కలపటం చేత ఈ రవ్వలడ్డు తయారౌతున్నాది. దానికి స్వభావమైన గోధుమయందుగాని, బేడలయందుగాని యీ మధురత్వము లేకపోయినప్పటికిని మధురమునందించే చక్కెర అందులో చేరటంచేత దానికి కూడా మధురత్వాన్ని అందిస్తూ వచ్చింది. విష్ణుత్వమనేది జడపదార్థమునందు కూడను మనము స్మరించటం చేత ఆ జడ పదార్థము కూడను మధురమైన దైవత్వముగా రూపొందుతుంది. మనము ఆరగించే తీపులకు అనేక రూపనామములు ఉండినప్పటికిని అన్ని తీపులయందు చక్కెర ఒక్కటేయని సత్యము మనము ఎట్లా గుర్తిస్తున్నామో అదేవిధముగా అనేక రూపనామములు ధరించిన వ్యక్తులుగా వుండినప్పటికి సర్వులయందు కూడను విష్ణుత్వమనే మధురమైన ఆత్మతత్వము ఉండటంచేతనే ఈ ప్రేమ అనేక స్వరూపములలో ఒకరికొకరు సంబంధము, అనుబంధము, ప్రతిబంధములకు మూలకారణమైంది. ఈ

srisathyasaivahini.org

మధురమైన విష్ణుత్వమును మనము కొంతవరకు విచారణ చేసిగాని లేక పెద్దల యొక్క ప్రబోధలవల్లగాని, గ్రంథ పఠనము వల్లగాని లేక గురువుల యొక్క దర్శన, స్పర్శన, సంభాషణలచేతగాని మధురత్వాన్ని కొంతవరకు అర్థము చేసుకొని సర్వవ్యాపకత్వమనే విష్ణుత్వాన్ని గుర్తించటము వ్యక్తిత్వానికి ప్రప్రథమయిన వానిలో ప్రధానమైనది. ఇట్టి దీనిని నారదుల వారు ఒకానొక సమయంలో కృష్ణుని చెంతకు వెళ్లి, ఏదో మూర్ఖమైన భావముతో, మూఢత్వమైన విశ్వాసముతో బృందావన గోపికలందరు నీ తత్త్వమును గుర్తించక పెడమార్గమును పట్టి ఏదో వ్యామోహములో వారు బంధితులౌతున్నారు. తమరు సెలవిచ్చిన నేను ఒక తూరి బృందావనము వెళ్లి వారికి కృష్ణతత్త్వము బోధించి వారి హృదయమును జ్ఞానతత్త్వముగా మార్చటానికి నేను ప్రయత్నం చేయాలని సంకల్పించుకున్నాను. అందుకు ఆజ్ఞను దయచేయమని ప్రార్థించాడు. దీనికి కృష్ణుడు తనలో తాను నవ్వుకున్నాడు. 'అయ్యో భక్తియందు మూఢత్వము ఒకటి, బుద్ధిమంతుని తత్త్వము ఒకటి అని రెండు వున్నవా? ఈ మూఢత్వములోనున్న ఆనందము ఈ విచారణ తత్త్వములో యేమాత్రము తాను విచారణ చేయటం లేదు. గోపికలు మూఢులని గాని లేక గోపికలు తెలివిలేనివారనిగాని ఈ నారదుడు భావించుకోటం నారదుని యొక్క మూర్ఖత్వం, నారదుని యొక్క మూఢత్వం అంతేగాని గోపికలకు తెలిసిన కృష్ణతత్త్వము మరొకరికి ఎవ్వరికి తెలియదనేటువంటి విషయాన్ని తెలుసుకున్న కృష్ణుడు, ఈ నారదునికి గుణపాఠము నేర్పే నిమిత్తమై 'నారదా! తప్పక వెళ్లిరమ్మని' ఆజ్ఞ యిచ్చాడు. (తక్షణమే) బృందావనము నారదుడు రావటంచేత కృష్ణుని వార్తలు ఏమైనా తెలుస్తాయేమోననవి అందరు దగ్గర చేరారు. దగ్గర చేరేటప్పటికి, నారదుడు ఈ కృష్ణతత్త్వమును వర్ణించటానికి పూనుకున్నాడు. మూర్ఖులైన గోపికలారా! కృష్ణతత్త్వము మీకు తెలియదు. ఏ శాస్త్రముగాని, ఏ వేదసారము గాని అర్థము చేసుకునే శక్తిసామర్థ్యములు మీలో లేదు. కనుక మీరు కూర్చోండి కృష్ణతత్త్వము చక్కగా బోధిస్తాను' అని చెప్పాడు. అందులో ఒక గోపిక లేచి 'నారదా కాలమును వ్యర్థము చేసుకునే ప్రయత్నానికి నీవు పూనుకోకు. కృష్ణుని యొక్క వార్త ఏమైనా మా బృందావనమునకు వచ్చే వార్త ఏమైనా ఉన్నదా లేదా అది మాత్రమే చెప్పి నీవు వెళ్లు' అన్నారు. అందుకే నేను కృష్ణుని తత్త్వము బోధించే నిమిత్తము వచ్చాను, కృష్ణుని రాక

srisathyasaivahini.org

నాకు తెలియదు అన్నాడు. అనేటప్పటికి గోపికలందరు లేచి, నిరంతరము మృధుమధురమైన నామముతో మా కాలమును ఎంత ఆనందముగానో గడుపుతున్నాము. అట్టి ఆనందమును నీవు వ్యర్థము చేసే నిమిత్తమై మా కాలమునకు అడ్డు తగులుతున్నావు. నారదా! నీవు వచ్చినదారి పట్టుకొని వెళ్లు. మా చిత్తములలో కృష్ణుని ప్రేమ హత్తుకొని పోయింది. కృష్ణునికి మాకు ఏనాటికీ ఎడబాటురాదు. కనుక అట్టి కృష్ణతత్త్వాన్ని మేము గుర్తించామని ఒక గోపిక లేచింది, అందరూ లేచి వెళ్లిపోయారు. అప్పుడు నారదుడు ఈ గోపికలయొక్క చిత్తము యొక్క తత్త్వాన్ని గుర్తించుకొని, 'ఛీఛీ! నేనే మూర్ఖుడను నిరంతరము తన హృదయమునందు చింతనగావించే సాత్విక భావము కంటె యింక కృష్ణతత్త్వము వేరొకటున్నదా! కృష్ణుడు సర్వవ్యాపకుడు, సర్వ భూతాంతరాత్మ అలాంటి సర్వజ్ఞత్వమును గుర్తించుకోలేని నేను కృష్ణ తత్త్వమును బోధిస్తాననటం నాయొక్క బలహీనతే' అని తనకు తాను చెంపలు వేసుకొని ఈ బృందావన గోపికలయొక్క దివ్యజ్ఞానమనే దీపికలు లోకమునకంతా ప్రసరించుగాక' అని ఆశీర్వదించి తాను తిరిగి మధురకు వెళ్లాడు. వారి హృదయములందు కృష్ణుడు స్థిరనివాసియై వుండటం చేతనే ఆ గోపికలకు ఎట్టి భయముగాని, ఎట్టి అభిమానముగాని, ఎట్టి లోకముతో కూడిన భేదభావములు గాని, కోపతాపములుగాని వారియందు చెలరేగేటువంటివి కాదు. దీనిని పురస్కరించుకొనే నారదుడు చిన్న శ్లోకముగా చెప్పాడు:

**అత్తలు మొత్తుకున్న మరి భర్తలు కత్తులు నూరుచున్న**
**నోరెత్తరు కోపగించరు, ఎటకేగరు భీతిలబోరు గోపికల్**
**పొత్తములందు చిత్తరువురీతిగ నుండె వారిలో కృష్ణుడు**

ఒక పుస్తకములో ఒక కాగితముపైన కృష్ణుని యొక్క పిక్చరు వత్తినప్పుడు ఆ కాగితమునుగానీ, ఆ బొమ్మనుగాని వేరు చేయటానికి సాధ్యము కాని రీతిగా ఈ గోపికల చిత్తమనే కాగితముపైన 'కృష్ణా' అనే block ను వత్తినారట. అప్పుడు చిత్తమును గాని, కృష్ణునిగాని వేరు చేయటానికి సాధ్యము కాని స్థితిలో వుంటున్నాది. అక్కడనే బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి అనేటువంటి సత్యాన్ని గోపికలు లోకమునకు చాటినారు. అట్టి విష్ణుత్వాన్ని గుర్తించిన గోపికల యొక్క తత్త్వాన్ని కూడను ఆనందగిరి గురువులవారికి చక్కగా తెలిపాడు. దీనిని పురస్కరించుకొని ఆనందగిరి మరొక శ్లోకాన్ని తెలుపుతూ వచ్చాడు.

sri sathyasai vahamrutam

**యా చింతా భువి పుత్ర మిత్ర భరణౌ వ్యాపార సంభాషణే**
**యా చింతా ధనధాన్య భోగ యశసే లాభే సదా జాయతే**
**సా చింతా భువి నందనందన పదద్వంద్వారవిందే క్షణే**
**కా చింతా యమరాజ భీమసదన ద్వార ప్రయాణే ప్రభో**

ధనధాన్యభోగ యశస్సుల నిమిత్తమై మానవుడు ఎంత చింత చేస్తున్నాడో, పుత్ర మిత్ర భరణ వ్యాపార నిమిత్తమై మానవుడు ఎంత చింత చేస్తున్నాడో ఆ కాలములో క్షణకాలము నందనందనుని పదములగురించి చింతన చేసినచో భయంకరమైన యమునియొక్క ద్వారముల చెంతకు చేయవలసిన ప్రయాణమునుండి రక్షింపబడతాడు. కనుక, భగవద్భక్తిగాని, విష్ణుత్వములోనున్న సారమును గాని, తెలుసుకున్న వ్యక్తికి ఎట్టి భయమునకుగాని, ఎట్టి చింతకుగాని ఎట్టి విచారమునకు గాని అవకాశము లేదని కూడను ఈ ఆనందగిరి బోధ చేశాడు. ఈ కలియుగమునందు కాలము యొక్క విలువను గుర్తించుకోలేని వ్యక్తులు అభివృద్ధి అవుతున్నారు. కారణము ఏమనగా అనిత్యము, అసత్యము, అసత్యమైన విషయ సంబంధములకోసమై యావత్ కాలమును, కాయమును అంకితము చేసి వ్యర్థులైపోతున్నారు. కనుక ఏ చిన్న పవిత్రమైన కార్యము చేయాలన్నప్పటికిని వారికి వ్యవధి చిక్కదు. కాని, అపవిత్రమైన పనులయందు దినములతరబడి, వారముల తరబడి, నెలల తరబడి జీవితాన్ని గడుపుతుంటారు. ఒక చిన్న ఉదాహరణము. ఇలాంటి సత్సంగమేమైనా జరిగిందంటే 'అయ్యా అర్ధగంట సత్సంగములో పాల్గొనుటకు వీలుంటుందా' అని అడిగేటప్పటికి, అర్ధగంట టైము లేదంటారు కాని, క్లబ్బుల్లోకి పోయి ఆరుగంటల నుండి తెల్లవారుఝామున 3 గంటల వరకు పేకాట ఆడటములో వారికి నిద్ర కూడా రాదు. ఇంతేకాకుండా ఒక యింటిలోని చిన్న సాలిగ్రామాన్ని ఒక స్పూను నీరుతో అభిషేకము చెయ్యవయ్యా అంటే 'టైము లేదు' అంటారు.కాని దున్నపోతులను బాగా కడిగి, కడిగి శుభ్రము చేయటానికి పూనుకుంటారు. వీడి తలవ్రాత ఆ రీతిగా వున్నది. కనుక మంచి కార్యములందు యేమాత్రము యిచ్ఛాశక్తి కలుగదు. చెడ్డ కార్యములోపల మహా ఉత్సాహము, శక్తి కలుగుతుంటాయి. అందువలననే మొన్న కూడను నేను చెప్పాను

**సత్యం జనవిరోధాయ అసత్యం జనరంజనం**
**సురావిక్రేయతే స్థానే దద్యాధికం పీత్వా గృహే గృహే**

మనము పాలు, పెరుగు అని యింటింటికి తెచ్చి అమ్మినప్పటికిని వద్దు వెళ్లండి అంటారు. ఊరికి దూరంగా పెట్టుకొన్న మద్యపానం దగ్గరికి నడచి, శ్రమనైనా పడి ఆ చెడ గొట్టే పదార్థాన్ని గ్రోలి వస్తుంటారు. ఇంక మానవుని యొక్క తత్త్వము సత్యము ఏమిటి? అసత్యము ఏమిటి? మానవుని జీవితములో ఏది మంచిది, ఏది ఉపేక్ష, ఏది అపేక్ష అనే విచారణశక్తి శూన్యం కావటం చేతనే మానవుడు కేవలం మానవత్వానికి తగిన గౌరవమును అందించలేకపోతున్నాడు. కనుక, సత్యా సత్యముల యొక్క విషయమును తెలుసుకొని ఈ విష్ణుత్వమనే సర్వవ్యాపకత్వాన్ని మనము కొంతవరకును అనుభవించుకోటానికి తగిన ప్రయత్నము సల్పాలి. అట్టి ప్రయత్నము సల్పినప్పుడే మన జీవితమనేది చక్కగా మానవత్వానికి తగిన అర్థాన్ని అందిస్తుంది. అట్లుకాకుండా ఏదో సంసార సంబంధమైన బాధ్యతలు అనేకంగా వున్నాయని లేక వ్యవహార సంబంధమైన బాధ్యతలు అధికంగా వున్నాయని యింకో ఉద్యోగ సంబంధమైన నిబంధనలు చాలా వున్నవని యిట్టి స్థితిలోనేను యిట్టి సత్సంగమునకు చేరటానికి సాధ్యము కాదని అనేక రకములైన నెపములు చెప్పే వ్యక్తులు అనేకమంది వుంటుంటారు. కాని నిజముగా **“ఆ బాధ్యతలు యితనిని బంధించుచున్నవా, యితనే ఆ బాధ్యతలతో బంధింపబడుటకు ప్రయత్నము చేస్తున్నాడా”** అనే సత్యాన్ని కూడను మనము విచారణ చేయాలి.

దీనికి ఒక చిన్న ఉదాహరణము. మన భారతదేశమునందు కోతులను పట్టే ఒక విచిత్రమైన విధానము వున్నది. ఒక పెద్ద కడవ చిన్న మూతిగా ఉండేది తయారు చేయించి ఆ కడవలో కోతికి అతి యిష్టమైన పదార్థములంతా పెట్టటం అప్పుడు కోతి వచ్చి ఆ పదార్థములు తీసుకునే నిమిత్తమై తాను చేతిని లోపలపెట్టి చేతినిండుకు ఆ పదార్థములు పట్టుకోటంచేత ఆ చేయి బయటకు రాదు. అప్పుడు కోతి భ్రమిస్తుందట, నన్ను ఎవరో బంధించారు అని కడవను కూడను ఎత్తుకొని పోవటానికి చేతకాని స్థితిలో తబ్బిబ్బవుతుండగా పట్టేవాడు వచ్చి దానిని వలలో వేసుకొని పోతాడు. ఈ రకంగా కొన్ని అభ్యాసములు జరుగుతుంటాయి. ఈ పాత్రలో ఎవ్వరూ కోతిని బంధించలేదు. తానే ఆ పదార్థమును అధికంగా పట్టుకోటంచేత బంధింపబడింది. ఆ పదార్థమును విడిస్తే బయటకు వస్తుంది. అదేవిధముగా ఈ బ్రహ్మాండమైన పెద్ద పాత్ర లోపల సంసారమనే చిన్న

మూతిని పెట్టి అక్కడ సుఖసంతోషములనే పదార్థములు వేయటంచేత ప్రతి వ్యక్తి సుఖ సంతోషములకోసమై దానిలో చిక్కుకొని పోతున్నాడేగాని తనను సుఖ సంతోషములు బంధించటం లేదు. ఈ మానవుడు తనకు తానై ఆ పదార్థములపై బడి బంధితుడై పోతున్నాడు. అంతేగాని ఆ పదార్థములుగాని, సంతోషములు గాని, బాధ్యతలుగాని, సంసారములుగాని యితనిని యేమాత్రము బంధించటం లేదు. దానిని వదలెనా బయటపడిపోతాడు. అందువలననే ఈ విషయ సంబంధమైన కర్తవ్యకర్మలు మనము చేసుకుంటూ మనస్సును మాత్రము ఆ భావము నందు యిమడ్చకుండా వుండేందుకు ప్రయత్నం చేసుకోవాలి. ఇదే బంధమును అందించే గజేంద్రమోక్షమునందు కూడను చక్కదిగా ఉంటున్నాది. జీవితమనే దట్టమైన అరణ్యములో మదగజము వంటి మనస్సు స్వేచ్ఛా విహారము సల్పుతుంటుంది. దట్టమైన అడవిలో స్వేచ్ఛావిహారము సల్పుతున్న యీ మదగజము వంటి మనస్సు విషయ సంబంధమైన దాహము వేస్తుంది దానికి. అట్టి విషయ సంబంధమైన దాహము వేసినప్పుడు ఈ సంసారమనే కొలనులో త్రాగటానికి ప్రారంభిస్తుంది. అందులో కాలుపెట్టేటప్పటికి అభిమానము అనే మొసలి దానిని పట్టేస్తుంది. ఈ అభిమానము అనే మొసలి పట్టిన తక్షణమే దాని నుండి విడిపించుకోటానికి సాధ్యము కాదు. యీ మదగజము వంటి మనస్సుకు సాధ్యము కాదు. అప్పుడు కొంత ఆ అభిమానముతో పోరాడి పోరాడి కట్టకడపటికి 'నీవే తప్పనితఃపరం బెరుగ' ఓ భగవంతుడా! ఇక నాకు ఏమాత్రము సంసారము అక్కరలేదు, ఇప్పుడైనా రక్షించి యీ మొసలి యొక్క బాధనుండి నన్ను తప్పించమని, దృష్టిని ఈశ్వరునివైపు మరలుస్తాడు. అప్పుడు ఈశ్వరుడు దృష్టి తనపైన మరలుస్తాడు. దీనినే సుదర్శనము అన్నారు. సుదర్శన మనేది చక్రము కాదు. మంచి దృష్టి. ఈశ్వరదృష్టి గజమునకు వచ్చిన తక్షణమే ఈశ్వరదృష్టి ఈ గజముపైన ప్రాకింది. వెంటనే బంధవిమోచన జరిగింది. కనుక సుదర్శనం కావాలి. అప్పుడే భగవంతుని అనుగ్రహ కిరణములు మనపైన ప్రసరించటానికి వీలౌతుంది. నేను అధికకాలము తీసుకొని మిమ్ము శ్రమ పెట్టటానికి ఏమాత్రము ఒప్పుకోను. సమయము వచ్చినది కనుక, ఈనాటి శ్లోకమునకు సంబంధించినది కనుక గజేంద్రమోక్షము వరకు మనం పోనక్కర లేదు. ఒక వ్యక్తి తన జీవితములో సుఖమునుంచి, తన వాంఛనుండి కడపటి వరకు ఏవిధముగా మారినాడు అనేది స్వామి చెంతనే అట్టి అనుభవాన్ని కూడను

ఒక ఆదర్శవంతమైన ఉపమానమున్నది.

## యత్న ప్రయత్నములద్వారానే దైవానుగ్రహం లభిస్తుంది

20 సం॥లకు పూర్వము ఒక విద్యార్థి నా దగ్గరకు వచ్చాడు. స్వామి! నేను చదువులో 1st class రావాలి అని ప్రార్థించాడు. మంచిది నాయనా! నీవు చదవవలసిన రీతిగా చదవాలి. నీ ప్రయత్నము ఉండాలి. యత్న ప్రయత్నములు మానవ ధర్మము. జయాపజయములు దైవాధీనము. నీ యత్న ప్రయత్నము పురస్కరించుకుని దైవానుగ్రహము వుంటుంది. తప్పక ప్రయత్నము చేయమని ధైర్యాన్ని అందించాను. తదుపరి తాను పాసయ్యాడు. తాను చాలా సంతోషించి రెండవ సంవత్సరము 'స్వామీ! నేను 6 నెలల నుండి ప్యాసైన డిగ్రీని చేతిలో పట్టుకొని ఉద్యోగము లేక అవస్థ పడుతున్నాను. తమరు ఎట్లైన అనుగ్రహించి నాకు ఒక ఉద్యోగము వచ్చేటట్లుచేయాలి' అని ప్రార్థించాడు. తిరిగి అతని యొక్క అదృష్ట వశాత్తు ఒక నెలలోపలనే ఉద్యోగము చిక్కింది. తిరిగి మూడు నెలలకే నా దగ్గరకు వచ్చాడు. 'ఏమి ఉద్యోగము చిక్కిందా' అని ప్రశ్నించాను. చాలా సంతోషంగా, మంచి ఉద్యోగమే చిక్కింది స్వామి. మా ఆఫీసులోపలనే ఒక టైపిస్టు వుంటున్నాది. ఆమెను నేను పెండ్లి చేసుకోవాలని ఉంది' అన్నాడు. 'నాయనా! నీ తల్లిదండ్రులకు యిష్టమున్నదా? వారికి విరుద్ధమైన రీతిగా పోవటము మంచిది కాదు అని అనేకరకములుగా అతనికి బోధించాను. కానీ, ఆ పిల్లవాడు ఏమాత్రము దారికి రాలేదు. విరుద్ధమైనా పోయి ఆ బిడ్డను పెండ్లి చేసుకోటానికి సంసిద్ధుడై వుంటున్నాడు. ఆమెను పెండ్లి చేసుకోకుండా పోతే నేను ప్రాణమైనా విడుస్తాననే మూర్ఖములోపల ఉంటున్నాడు. అప్పుడు నేను ఖండించి, సరే నాయనా! నీవు కొంత విచారించి నీ తల్లిదండ్రులను ఒప్పింటానికి పూనుకో. వారికి యిష్టమైనప్పుడు తప్పక నేను యిష్టపడతాను. నా ఆశీర్వాదములు నీకు ఎప్పుడు వుంటున్నాయని పంపించాను. సరి! ఎట్లాయినా తల్లిదండ్రులను ఒప్పించుకుంటానని వెళ్లినాడు. ఇంక తల్లిదండ్రులకు అనేక కీడులంతా పెట్టటం చేత బిడ్డయొక్క సుఖాన్ని కోరి, ప్రాణం తీసుకుంటాడో యేమోనని నిర్బంధంగా ఒప్పుకున్నారు పాపం. సరి వివాహము జరిగిపోయింది. తిరిగి ఒక సంవత్సరం అయిన తరువాత మరి యిద్దరు కలసి వచ్చారు. ఏమి నాయనా పెండ్లి అయిందా?' అడిగాను.

sri sathyasai vachanamrutam

'పెండ్లి అయింది స్వామి. కొడుకు కావాలి' అని అడిగాడు. సరి మరి రెండు సంవత్సరములకు కొడుకు కూడను పుట్టాడు. కొడుకు పుట్టేటప్పటికి ఆమె ఉద్యోగము వదలిపెట్టింది. ఇంటిలో ఖర్చులు అధికమవుతూ వచ్చాయి. మూడవ సంవత్సరము నా దగ్గరకు వచ్చాడు. 'స్వామి! ఆరేండ్లయి పోయింది నేను ఉద్యోగములో చేరి. నాకు ప్రమోషను రాలేదు. ప్రమోషన్ కావాల'ని వచ్చాడు. అయితే, ఈ పిల్లవాడు ప్రాపంచిక విషయాల్లో మూర్ఖంగా ఉండినా స్వామి విషయములో చాలా భక్తి శ్రద్ధలతో ఉండేవాడు. నాయనా నీవు బాధలు పడుతున్నావు. తప్పక నీవు మంచిగా నడుచుకుంటూ ఉండు. నేను అనుగ్రహిస్తాను' అని చెప్పాను. వెళ్లిన తక్షణమే ప్రమోషను వచ్చింది పాపం. తదుపరి ఒక 5 సం॥లు రాలేదు. ప్రమోషను వచ్చిన కొంతకాలము ఆనందంగా ఉంటున్నాడు. ఈ ఆఫీసులో ఎంత ప్రమోషను వచ్చిందో యింటిలో కూడా బిడ్డల ప్రమోషన్ ఎక్కువైపోయింది. ఐదుమంది పిల్లలైపోయారు. సరి. తిరిగి 6 సం॥ల తరువాత వచ్చాడు. స్వామీ! నాకు సంసారమే వద్దు నేను తమ ఆశ్రమములో చిన్న పనియిస్తే ఆ పనిచేసుకుంటాను. సంసారము చాలా కష్టముగా వుంటున్నాది పిల్లల పోరు నేను భరించుకోలేను. ఈ భార్య నాపైన అనేకరకములైన నిందలు మోపి మా యిద్దరిక యే మాత్రము సుఖము లేకుండా వుంటున్నాదని చాలా ఏడ్చుకున్నాడు. సంసారము మహాసర్పంగా పట్టుకుంది నన్ను అన్నాడు. అప్పుడు నేను చెప్పాను 'నాయనా! నీవే కోరి ఆ సర్పాన్ని పట్టుకుంటివా, ఆ సర్పము నిన్ను వచ్చి పట్టిందా చెప్పు'మన్నాను. ఈ చిన్న వయస్సునందు మంచిచెడ్డలు అనే విచక్షణ లేక వివేకము శూన్యమైపోయి నిత్యానిత్య విషయపరిశీలన చేయలేని మూర్ఖత్వములో పడిపోయి అనేక రకములైన కష్టములకు, దుఃఖములకు గురై పోతున్నాము. కనుక యిట్టి మూర్ఖత్వానికి యేమాత్రము గురికాక, దైవత్వమును కొంతవరకు విశ్వసించి, తల్లిదండ్రుల యొక్క బాధ్యతను గుర్తించి మనయొక్క గౌరవ మర్యాదాలను నిలుపుకునే స్థితికి మనము విద్యను గరపుకోవాలిగాని విద్య విద్య అనుకొని కేవలము తల్లిదండ్రులను ధిక్కరించి నీతి నియమములంతా విసర్జించి, గౌరవ మర్యాదలను మంటగలిపి, మన స్వార్థముననే మన జీవితమును నిప్పులో వేసుకోవటానికి పూనుకోకూడదు. మనము జీవితము నీతి నిజాయితీలపై జీవించాలి. కనుక జీవితము రానీ,

sri sathyasai vachanamrutam

రాలనీ, ధనము చిక్కని, చిక్కక పోనీ, money comes and goes, morality comes and grows. నీవు నీతి నిజాయితీలను పెంచుకోటానికి ప్రయత్నము చేయాలిగాని జీవితములో గౌరవ మర్యాదలు పాడైపోయెనా జీవితము living death. జీవించి కూడను తాను గతించిన వ్యక్తిగా తయారైపోతాడు. కనుక, నీవు సత్యమార్గములో ప్రవేశించి సహనము, త్యాగము, అన్యోన్యత అనే వాటిని అభివృద్ధి పరచుకొని నీ యొక్క గుణమును ప్రధానమైన లక్ష్యమునందు పెంచుకున్నప్పుడు తప్పక యిహమును సుఖియింప హేమతారక విద్య పరమున సుఖియింప బ్రహ్మవిద్య. ధర్మవిద్య, బ్రహ్మవిద్యలందు నీవు చక్కని ఆదర్శప్రాయుడైన వ్యక్తిగా తయారౌతావు. కనుక, మీరు విద్యావంతులైనప్పటికిని గొప్ప గొప్ప ఉద్యోగములు ఏలినప్పటికిని, దేశమునకు నాయకులుగా మీరు తయారైనప్పటికిని చాలా సంతోషమే. అయినప్పటికి హృదయాన్ని మాత్రము పరిశుద్ధమైన రీతిగా ఉండి భగవదనుగ్రహానికి సరియైన ప్రవర్తనలోపల మీ జీవితాన్ని అంకితము చేసుకోవాలి. ఎట్టి విద్యలు లేని ఆనందగిరికి గురు కటాక్షముచేత మహాపండితుడుగా తయారైపోయి భద్రి పీఠమునకు అధిపతిగా తయారయ్యాడు. కనుక, గురు కటాక్షంగాని భగవదనుగ్రహంగాని పొందే అవకాశమునకు సరైన ప్రయత్నములు సల్పినప్పుడు ఎట్టిదానియందు మనము విజయమును సాధించటములో ఎట్టి సందియము ఉండదు.

**(తేదీ 01-06-1973 న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam